

వీడలేమని.. వీడ్కోలని..



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలికి పాఠశాల విద్యార్థులు కన్నీటి వీడ్కోలు పకారు. మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏడేళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు రజిత ఇటీవల జరిగిన బదిలీల్లో బొమ్మరం ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. గురువారం ఆమె పాఠశాలకు చివరి రోజు హాజరు కాగా.. విద్యార్థులు బోరున విలపిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. తమను వదిలి వెళ్లొద్దని వేడుకున్నారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులను టీచర్ ఆప్యాయంగా చూసుకునేవారని గ్రామస్థులు గుర్తు చేసుకున్నారు. విద్యార్థుల ప్రేమకు ఉపాధ్యాయురాలు సైతం కన్నీరు పెట్టుకున్నారు. విద్యార్థులకు, గ్రామస్థులకు వీడ్కోలు పలికారు.

-మాసాయిపేట

కర్రలే స్తంభాలు.. గాల్లో ప్రాణాలు



రోజుకో ప్రమాదం జరుగుతున్నా ట్రాన్స్‌కో అధికారులు కళ్లు తెరవడం లేదు. అల్లాదుర్గం మండలంలోని రాంపూర్-కాయిదంపల్లి శివారులోని ఈదునేరి పెంటయ్య వ్యవసాయ క్షేత్రంలో కొన్నేళ్లుగా విద్యుత్ తీగలు నేలను తాకేవిధంగా వేలాడుతున్నాయి. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో హైటెన్షన్ వైర్లు కిందపడకుండా కర్రలను ఆధారంగా ఏర్పాటు చేశారు. కానీ,వర్షాకాలం సీజన్ కావడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని, అధికారులు స్పందించి స్తంభాలను ఏర్పాటు చేయాలని రైతు కోరుతున్నారు.

-అల్లాదుర్గం

అధికారుల చేతుల్లో..

● ఇప్పటికే పంచాయతీల్లో.. ఇకపైన మండలాలకు ● ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఉత్తర్వులు ● ఎన్నికలు పూర్తయ్యే వరకు వారిదే పాలన బాధ్యత



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూలై4: గ్రామాలు, మండలాల పరిపాలన వ్యవహారాలన్నీ అధికారుల చేతుల్లోకి వచ్చాయి. ఆర్నెళ్ల క్రితం గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు పూర్తికావడంతో మండల స్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించారు. తాజాగా స్థానిక సంస్థలకు సంబంధించిన ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగియడంతో జిల్లా స్థాయి అధికారులకు మండలాల బాధ్యత అప్పగించారు. అయితే గ్రామాలను పర్యవేక్షిస్తున్న అధికారులపై ఇప్పటికే విమర్శలు వస్తున్నాయి. మండల ప్రత్యేకాధికారులైనా బాధ్యతగా వ్యవహరించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గడిచిన ఐదేళ్లలో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా కీలకమయ్యారు. నిన్నటి తో వారి పదవీకాలం ముగిసింది. వెంటనే ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామపంచాయతీలతో పాటు స్థానిక సంస్థలు సైతం అధికారుల పాలనల్లోకి వెళ్లాయి. సంగారెడ్డి జిల్లాలోని 647 గ్రామపంచాయతీలు, 28 మండలాలు, సిద్దిపేట జిల్లాలోని 499 గ్రామపంచాయతీలు, 26 మండలాలు, మెదక్ జిల్లాలోని 467 గ్రామపంచాయతీలు, 20 మండలాల పరిపాలన కార్యకలాపాలన్నీ ఇక నుంచి అధికారులే పర్యవేక్షించనున్నారు.

బాధ్యతలను భారంగా..

ప్రస్తుతం మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. అయితే ఆర్నెళ్ల క్రితమే గ్రామాలకు నియమించిన ప్రత్యేకాధికారుల్లో కొందరు తమ బాధ్యతలను భారంగా మోస్తున్నారు. అదనపు బాధ్యతలపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు లేకపోవడంతో ఆ బాధ్యతలను ప్రత్యేకాధికారులే నిర్వర్తించాల్సి ఉంది. కానీ కొందరు అధికారులు తమదైన ముద్రవేస్తుండగా చాలా మంది గ్రామాల పరిపాలనతోపాటు అభివృద్ధి, సంక్షేమాలను విస్మరిస్తున్నారు. కనీస వసతులను కల్పించడంలో విఫలమవుతూ స్థానికంగా విమర్శలను ఎదుర్కొంటున్నారు. చుట్టపుచూపుగా గ్రామాలను సందర్శిస్తూ సంతకాలకు పరిమితమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే తమ మాతృశాఖల్లో ఉన్న పనులతోనే సమయం గడిచిపోతుందని, దీనికితోడు గ్రామాల బాధ్యతలను పర్యవేక్షించడం భారంగా మారిందనే నిరుత్సాహాన్ని వ్యక్తం చేస్తున్నారు. తాజాగా నియామకమైన మండల ప్రత్యేకాధికారులతో కొత్తదనం చేకూరుతుందనే అంచనాలున్నాయి. మండల ఇన్‌చార్జులంతా జిల్లా స్థాయి అధికారులే కావడంతో గ్రామాల స్పెషలాఫీసర్లను గాడిన పెట్టే అవకాశాలు లేకపోలేదు.

మరో ఆర్నెళ్లు అధికారులేనా..!

ఫిబ్రవరిలో గ్రామపంచాయతీ పాలకవర్గాల గడువు ముగియగా అప్పటి నుంచి ప్రత్యేకాధికారులే కొనసాగుతున్నారు. వాస్తవానికి గత జనవరిలోనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి. కానీ రిజర్వేషన్ల కేటాయింపు విషయంలో అసమానతలు ఉన్నందున ఎన్నికలను వాయిదా వేస్తూ వస్తున్నారు. కులాల గణన తర్వాతనే ఎన్నికలను నిర్వహించే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికలను సైతం జూన్‌లో నిర్వహించాల్సి ఉండగా రిజర్వేషన్ల సమస్య ఉండడంతో ఇవి కూడా వాయిదా పడ్డాయి. అందుకే మండలాలకూ ప్రత్యేకాధికారులను నియమించారు. మరి కొద్ది రోజుల్లో కులాల గణన చేపట్టినా అది ముగియాలంటే కనీసం మూడు నుంచి నాలుగు నెలల సమయం పడుతుందని అంచనా. ఈ లెక్కన ఎన్నికలు పూర్తయ్యి కొత్త ప్రజాప్రతినిధులు అడుగుపెట్టాలంటే మరో ఆర్నెళ్లు ఆగాల్సిందేనన్న చర్చ జరుగుతోంది.

మెదక్ జిల్లాలోని 20 మండలాల ప్రత్యేకాధికారులు

మండలం	అధికారి	హోదా	ఫోన్ నంబర్
1. అల్లాదుర్గం	కరుణ	జిల్లా కోపరేటివ్ అధికారి	9959223502
2. చేగుంట	బ్రహ్మాజీ	డీడబ్ల్యువో	7989668354
3. చిలప్‌చేడ్	బీ.మాన్య	సీపీవో	8491743316
4. హవేళీఘనపూర్	విజయలక్ష్మి	డీఎస్‌సీడీవో	8555894019
5. కొల్చారం	డి.రాధాకిషన్	డీఈవో	7207704500
6. కౌడిపల్లి	కే. యాదయ్య	డీఎల్‌పీవో(నర్సాపూర్)	9346275694
7.మనోహరాబాద్	జయచంద్రారెడ్డి	ఆర్డీవో(తూప్రాన్)	9346999260
8. మెదక్	ఆర్.ప్రవీణ్‌రెడ్డి	జిల్లా మైనింగ్ అధికారి	9849197095
9. నర్సాపూర్	శ్రీనివాస్‌రావు	డీఆర్‌డీవో(మెదక్)	9281484100
10. నార్సింగి	బ్రహ్మరావు	డీసీఎస్‌వో(మెదక్)	7386788243
11. నిజాంపేట్	ఎం.గోవిందు	జిల్లావ్యవసాయాధికారి	7288894450
12. పాపన్నపేట	సతీష్‌కుమార్	డీఎల్‌పీవో(మెదక్)	9440512846
13. రామాయంపేట	సత్యనారాయణ	డీఐఈవో(మెదక్)	7997994360
14. రేగోడ్	నర్సింహారావు	జిల్లామత్స్యశాఖాధికారి	6300475051
15. చిన్నశంకరంపేట	విజయ్‌శంకర్‌రెడ్డి	డీవీ అండ్ ఏహెచ్‌వో	7702771288
16.పెద్దశంకరంపేట	హరికృష్ణ	డీఎం, సివిల్ సప్లై	7995050807
17. శివంపేట	నర్సయ్య	జిల్లా ఉద్యానవనశాఖ	799772584
18. టేక్మాల్	యాదయ్య	డీపీవో	9959774492
19. తూప్రాన్	చల్లయ్య	సీపీవో, జడ్పీపీ	9652466866
20. వెల్దుర్తి	రాకేష్	జిల్లా ఆడిట్ అధికారి	994821328

సంగారెడ్డి జిల్లాలోని 25 మండలాల ప్రత్యేకాధికారులు

మండలం	అధికారి	హోదా
1. అమీన్‌పూర్	కొండల్‌రావు	సివిల్ సప్లయ్స్ డీఎం
2. అందోల్	ఆర్.గీత	మెప్మా పీడీ
3. గుమ్మడిదల	అఖిలేష్‌రెడ్డి	సాంఘిక సంక్షేమశాఖ డీడీ
4. హత్నూర	ఆర్.స్వప్న	జడ్పీ డిప్యూటీ సీఈవో
5. ఝరాసంగం	ఐనేష్	సర్వే, ల్యాండ్‌రికార్డ్ ఏడీ
6. జిన్నారం	పి.సోమేశ్వర్‌రావు	డీహెచ్‌ఎస్‌వో
7. కల్హేర్	కె.అంబికాసోని	వ్యవసాయశాఖ జేడీ
8. కంది	లలితకుమారి	సంక్షేమశాఖ అధికారి
9. కంగ్టి	నూతన్	వ్యవసాయశాఖ ఏడీ
10. కోహీర్	బి.సతీష్	జిల్లా మత్స్యశాఖ అధికారి
11. కొండాపూర్	టి.ప్రసాద్	డీసీవో
12. మనూరు	ఎం.రఘుబాబు	మైనింగ్ ఈడీ
13. మొగుడంపల్లి	మురళీమోహన్	డెయిరీ డీడీ
14. మునిపల్లి	రామాచారి	ఎస్సీ కార్పొరేషన్ ఈడీ
15. నాగిల్‌గిద్ద	బల్‌రామ్	జిల్లా ఆడిట్ అధికారి
16. నారాయణఖేడ్	శ్రీధర్‌రావు	జిల్లా అటవీశాఖ అధికారి
17. న్యాల్‌కల్	రవీందర్‌రెడ్డి	లేబర్ డిప్యూటీ కమిషనర్
18. పటాన్‌చెరు	దేవుజా	మైనారిటీ వెల్ఫేర్ అధికారి
19. పుల్కల్	బాల్‌రాజ్	అడిషనల్ డీఆర్‌డీవో
20. రాయికోడ్	జగదీష్	బీసీ సంక్షేమాధికారి
21. సదాశివపేట	వెంకటేశ్వర్లు	జిల్లా విద్యాధికారి
22. సంగారెడ్డి	రాంచందర్‌రావు	జిల్లా యువజన, క్రీడల అధికారి
23. సిర్గాపూర్	వెంకటేశ్వర్‌రావు	భూగర్భజలశాఖ డీడీ
24. వట్‌పల్లి	ఎం.ఫిరంగి	డీటీడబ్ల్యూవో
25. జహీరాబాద్	భిక్షపతి	వ్యవసాయ శాఖ ఏడీ



జిల్లా పరిషత్ సభ్యులను సన్మానిస్తున్న మంత్రి దామోదర్, కలెక్టర్ క్రాంతి, ప్రజాప్రతినిధులు

సమస్యల పరిష్కారానికి కృషిచేశాం

నిధుల కొరతతో ఆశించినంత అభివృద్ధి చేయలేకపోయాం

జడ్పీ చివరి సర్వసభ్య సమావేశంలో చైర్‌పర్సన్, సభ్యుల భావోద్వేగ ప్రసంగాలు

చైర్‌పర్సన్, జడ్పీటీసీలను సన్మానించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

సంగారెడ్డి టౌన్, జూలై 4 : గడిచిన ఐదేళ్లలో జిల్లాలో సమస్యల పరిష్కారానికి తమవంతుగా కృషి చేశామని జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు పేర్కొన్నారు. సంగారెడ్డి జడ్పీ సమావేశ మందిరంలో గురువారం చైర్‌పర్సన్ అధ్యక్షతన చివరి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ క్రాంతి, ఎంపీలు రఘునందన్‌రావు, సురేష్ షెట్కార్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సంజీవరెడ్డి, మాణిక్‌రావు, సునీతారెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఎమ్మెల్సీలు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు జడ్పీటీసీలు తమ అనుభవాలను పంచుకున్నారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో గ్రామాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు చేయలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

పలు సమస్యలపై సభ్యుల చర్చ

జడ్పీ సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు పలు సమస్యలపై అధికారులతో చర్చించారు. జడ్పీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్ మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని జిన్నారం రాయిని చెరువు సమస్యను జిల్లా కలెక్టర్ పరిష్కరించారని, అందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. జిన్నారం మండలం శివానగర్‌లో 144 సర్వే నంబరులోని పేదలకు చెందిన 140 ఎకరాల భూమిని టీఎస్ ఐపాస్‌కు అప్పగించినప్పటికీ భూ నిర్వాసితులకు ఇవ్వాల్సిన ఎకరాకు ఆరు వందల గజాల స్థలం కేటాయించకపోవడం శోచనీయమని అన్నారు. మంగంపేట శివారులో రెండెకరాల విస్తీర్ణంలో డంప్ యార్డు నిర్మిస్తే పక్కనే ఉన్న ఓ కంపెనీ యాజమాన్యం దాన్ని కూల్చివేసినప్పటికీ కంపెనీవారిపై చర్యలు తీసుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఇందుకు డిపిఓ సాయిబాబ స్పందిస్తూ కంపెనీ యాజమాన్యంపై ఇటీవల కేసు నమోదు చేయించామన్నారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ నారాయణఖేడ్ ఆసుపత్రిలో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది విధులకు సకాలంలో హాజరుకావడం లేదని తెలిపారు. మందుల సరఫరా కూడా అంతంతగానే ఉన్నదని మంత్రి దృష్టికి తెలియజేశారు. మంత్రి దామోదర్ స్పందిస్తూ మందుల సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో సబ్ సెంటర్ల నిర్మాణానికి రూ.20లక్షలు సరిపోవడం లేదని, మరిన్ని నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఆత్మకూర్ నుంచి పొట్టిపల్లి చౌరస్తా, ఏటిగడ్డ సంఘం, బొబ్బిలిగామ, బుస్సారెడ్డిపల్లి, గ్రామాల మీదుగా సింగూరు ప్రాజెక్టు వరకు రోడ్డు గుంతల మయంగా మారిందని తెలిపారు. ఈ రోడ్డు మరమ్మతు కోసం నిధులు కేటాయించాలని కోరారు.

జడ్పీటీసీలు, ఎంపీపీలకు సన్మానం

ఐదేళ్ల పదవీ కాలం ముగిసిన సందర్భంగా జడ్పీ హాల్‌లో జిల్లాలోని జడ్పీటీసీలు, ఎంపీపీలను మంత్రి దామోదర్, జడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ, జిల్లా కలెక్టర్ క్రాంతి ఘనంగా సన్మానించారు. సభ్యులకు శాలువాలు పుష్పగుచ్ఛంతో సత్కరించి జ్ఞాపికలను అందజేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



చైర్‌పర్సన్ మంజుశ్రీరెడ్డిని సన్మానిస్తున్న మంత్రి దామోదర్, కలెక్టర్ క్రాంతి, ప్రజాప్రతినిధులు

అందరి సహకారంతోనే..: మంజుశ్రీరెడ్డి



జడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఐదేళ్ల పాటు సభ్యులు అధికారుల సహకారంతో పదవీ బాధ్యతలు విజయవంతంగా పూర్తిచేయడం సంతోషంగా ఉంది. నిధుల కొరత వల్ల గ్రామాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయామనే బాధ ఉన్నది. రాబోయే కాలంలోనైనా జిల్లా పరిషత్‌కు, మండల పరిషత్‌లకు నిధులు పుష్కలంగా కేటాయిస్తారన్న ఆశిస్తున్నాం. పదవులు ఉన్నా లేకపోయినా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.


ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేస్తాం : మంత్రి దామోదర్ రాజనర్సింహ



వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. గతంలో విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు సంగారెడ్డి జిల్లాకు జేఎన్‌టీయూ. ఐఐటీహెచ్, సింగూరు కాల్వల నిర్మాణం తదితర ముఖ్యమైన పనులు పూర్తిచేయించా. ఇటీవల సింగూరు కాల్వల అభివృద్ధి కోసం మరో కోసం రూ.170 కోట్లు మంజూరు చేయించా. వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా వైద్య సేవలను మెరుగు పరిచేందుకు కృషిచేస్తా. సంగారెడ్డి జిల్లాలో అనేక వనరులు ఉన్నాయి. విద్యా, వైద్యం, పారిశ్రామిక, తాగు,సాగు నీరు తదితర రంగాల్లో జిల్లాను అగ్రగామిగా నిలుపాల్సిన అవసరం ఉన్నది. జిల్లాలో రహదారుల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తున్నాం. ఈ ప్రాంత అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలన్న తపన ప్రజా ప్రతినిధులకు ఉండాలి. అలాగే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న సంగారెడ్డి జిల్లా కేంద్రానికి రింగురోడ్డు అవసరం. ఎంపీలు సురేష్ షెట్కార్, రఘునందర్‌రావు సహకారం, రాష్ట్ర ప్రభుత్వ చొరవతో మంజూరు చేయించడానికి కృషిచేస్తా.



సంగారెడ్డిలో దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కలెక్టర్ క్రాంతి, అధికారులు



మెదక్‌లో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

స్ఫూర్తిదాయకం.. దొడ్డి కొమురయ్య పోరాటం

● సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ● పలువురు ప్రముఖుల నివాళి

సంగారెడ్డిరూరల్/మెదక్‌అర్బన్, జూలై 4: తెలంగాణ రైతాంగ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్యను ప్రతీ ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సందర్భంగా గురువారం సంగారెడ్డిలోని ఆయన విగ్రహానికి కలెక్టర్, మెదక్ ఎంపీ రఘునందన్‌రావ.. జడ్పీ సమావేశ మందిరంలో హాలులో దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ పోరాట తొలి అమరుడు కొమురయ్య ఆశయ సాధనకు కృషిచేయాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, బీసీ సంక్షేమాధికారి జగదీష్, ఓబీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపల్లి పాండు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మెదక్...

మెదక్ అర్బన్: తెలంగాణ రైతాంగ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య వీరోచిత పోరాటం చిరస్మరణీయమని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కొనియాడారు. మెదక్ కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య నేటి తరానికి స్ఫూర్తిప్రదాత అన్నారు.

నిమ్జ్ ప్రాజెక్టుకు సాగు భూములు ఇవ్వలేం

తహసీల్దార్ సంజీవరావుకు విన్నవించిన ఎల్గోయి గ్రామ రైతులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఝరాసంగం, జూలై 4: సాగు భూములు 'నిమ్జ్'కు ఇవ్వబోమని బర్దీపూర్, ఎల్గోయి గ్రామాలకు చెందిన రైతులు గురువారం తహసీల్దార్ సంజీవరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిమ్జ్ కోసం రెండో విడత భూసేకరణ చేపట్టే ఆలోచనను విరమించుకోవాలన్నారు. ఇప్పటికే భూములు కోల్పోయిన రైతు కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందని పేర్కొన్నారు. ఉన్న కొద్దిపాటి వ్యవసాయ భూమిని తీసుకుంటే తాము గ్రామాలను వదిలి వలస వెళ్లాల్సి వస్తుందన్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించి భూసేకరణను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంతరావు పాటిల్, రైతులు నందకుమార్, సాబేర్, గుండప్ప, వేణు, అంజద్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని రైతు మృతి



సంజీవరెడ్డి(ఫైల్)

గుమ్మడిదల, జూలై 4 : టిప్పర్‌ను అతివేగంగా నడుపుతూ రోడ్డుపై నిలుచున్న రైతును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన గుమ్మడిదల గ్రామంలో గురువారం చేసుకున్నది. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదల గ్రామానికి చెందిన రైతు సరెరెడ్డి గారి పాటక్ సంజీవరెడ్డి(60) ఉదయం పొలం పనులకు వెళ్లి స్కూటీపై తిరిగి వస్తుండగా మెదక్ హైదరాబాద్ జాతీయ రహదారి చిన్నపరెడ్డి పాత రైస్‌మిల్ సమీపంలోని ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఫీజ్ పోవడంతో రోడ్డుకు దూరంగా స్కూటీని ఆపి పరిశీలిస్తున్నాడు. నర్సాపూర్ వైపు నుంచి గండిమైసమ్మకు మట్టి లోడ్‌తో వేగంగా వచ్చిన టిప్పర్ అదుపుతప్పి సంజీవరెడ్డిని బలంగా ఢీకొన్నది. దీంతో ఎగిరి దూరంగా పడిన సంజీవరెడ్డి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సంజీవరెడ్డి సీపీఐ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సహచరుడిగా ఉంటూ అనేక పోరాటాలు చేశాడు. సీపీఐ జిల్లాస్థాయి నాయకుడిగా, రైతు సంఘం నేతగా రైతుల కోసం పోరాటం చేశాడు. సంజీవరెడ్డి మరణ వార్త తెలుసుకుని పలువురు నాయకులు వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సంజీవరెడ్డి కుమారుడు కరుణాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

దంపతుల మధ్య గొడవ మనస్తాపంతో భర్త ఆత్మహత్య



బోయిని యాదగిరి(ఫైల్)

కొల్చారం, జూలై 4: భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిల్ఎచెడ్ మండల పరిధిలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్కుల్ గ్రామానికి చెందిన బోయిని యాదగిరి(28)కి టేక్మాల్ మండలం ధన్నారం గ్రామానికి చెందిన మానసతో ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. కొన్నిరోజులుగా కుటుంబ సమస్యల కారణంగా భార్యాభర్తల మధ్య గొడవ జరుగుతున్నది. దీంతో మనస్తాపానికి గురైన యాదగిరి బుధవారం రాత్రి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఉదయం వరకు రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు గాలించగా.. పల్లెగడ్డ తండా సమీపంలో ఎనగండ్ల శివారులో ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహ్మద్‌గౌస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. యాదగిరి ఓ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు.

దైవదర్శనానికి వచ్చి.. మహిళ హఠాన్మరణం

వర్గల్, జూలై 4 : వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం వద్ద ఓ మహిళ హఠాన్మరణం చెందిన సంఘటన గురువారం చోటు చేసుకున్నది. గౌరారం ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. మేడ్చల్ జిల్లా, కుత్బుల్లాపూర్ మండలం, భాగ్యలక్ష్మీ కాలనిలో నివాసముంటున్న గళిగం బాలకిష్టమ్మ(54), కొడుకు సర్వేష్‌తో కలిసి ఇంటి పక్కనే నివాసముంటున్న కన్నెబోయిన నరిసంహారెడ్డి, సుజాత దంపతులలతో కలిసి బుధవారం మధ్యాహ్నం ఆటోలో దైవదర్శనం చేసుకోవడం కోసం నాచారం గుట్టకు వచ్చారు. నాచగిరి క్షేత్రంలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని మండపం సమీపంలోని సత్రం వరండాలో బస ఏర్పాటు చేసుకున్నారు. వారంతా రాత్రి భోజనం చేసి నిద్రిస్తుండగా 12.00 గంటల సమయంలో గళిగం బాలకిష్టమ్మ అకస్మాత్తుగా వాంతులు చేసుకోగా తల్లికొడుకు గొడవపడ్డారు. ఉదయం బాలకిష్టమ్మ నిద్రలోంచి లేవకపోవడంతో 108కి సమాచారం అందిండంతో అక్కడికి చేరుకున్న వైద్య సిబ్బంది బాలకిష్టమ్మ మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతురాలి కొడుకు సర్వేష్ 100 నంబర్‌కు కాల్ చేయడంతో గౌరారం పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని విచారించారు. మృతురాలి కూతురు ముధియర్ సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుర్తివాడలో ఓ ఇంట్లో చోరీ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పాపన్నపేట, జూలై 4 : తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు దొంగతనానికి పాల్పడ్డాడు. ఇంటి యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. పాపన్నపేట మండలం పరిధిలోని కుర్తివాడ గ్రామానికి చెందిన ముప్పారం గంగయ్య ఈనెల 2న ఊరికి వెళ్లి బుధవారం వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉన్నది. ఇంట్లోకెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా చేసి, రూ.2 లక్షల నగదు, రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లారని గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడి మృతి



రమేష్ మృతదేహం

తూప్రాన్, జూలై 4: అప్పులబాధతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా వ్యక్తి గురువారం మృతిచెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన పానగంటి గంగమ్మకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు పానగంటి రమేష్(26) జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. మద్యం కోసం చాలా మంది వద్ద అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చాలో తెలియక, జీవితంపై విరక్తి చెంది పది రోజుల క్రితం గడ్డి మందు తాగాడు. ఈ విషయాన్ని తల్లి గంగమ్మకు చెప్పగా తూప్రాన్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తూప్రాన్ ఎస్ఐ యాదగిరి తెలిపారు.

చికిత్స పొందుతూ ల్యాబ్ టెక్నీషియన్ మృతి



మహేశ్(ఫైల్)

చిన్నకోడూరు, జూలై 4 : పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్‌లో గురువారం చోటుచేసుకున్నది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నెమలి భాగ్యలక్ష్మి, కిష్టయ్య దంపతుల కుమారుడు మహేశ్ (31) సిద్దిపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. మహేశ్ ఏడాది క్రితమే వివహామైంది. తనకు వచ్చే జీతం డబ్బు సరిపోవడం లేదని మహేశ్ తన భార్య నిహారికకు చెబుతూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో కుటుంబపోషణకు అప్పు చేశాడు. అప్పు తీర్చే మార్గంలేక జీవితంపై విరక్తి చెంది బుధవారం అర్ధరాత్రి తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. చేపల కోసం చెరువులో వలలు వేసి ఇంటికి తిరిగి వస్తున్న గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి వ్యవసాయ బావి వద్ద మహేశ్ అపస్మారక స్థితిలో కనిపించాడు. అతడు వెంటనే మహేశ్ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. అక్కడికి చేరుకున్న కుటుంబసభ్యులు మహేశ్‌ను చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మహేశ్ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మహేశ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ జీహెచ్‌ఎంసీ కార్మికుడి మృతి



నర్సింహులు మృతదేహం

చిన్నశంకరంపేట, జూలై 4 : చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందిన సంఘటన చిన్న శంకరంపేట మండలంలోని ధర్పల్లిలో గురువారం చోటు చేసుకున్నది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాఘవుల నర్సింహులు(41) హైదరాబాద్ జీహెచ్ఎంసీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నూతన ఇల్లు నిర్మించాడు. ఇంటికి నిర్మాణం కోసం తెచ్చిన అప్పు భారం కావడంతో, దిక్కు తోచని స్థితిలో మూడు రోజుల క్రితం గ్రామంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు నర్సింహులును చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న నర్సింహులు పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. నర్సింహులు భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గేదెల మృతదేహాలు

గుమ్మడిదల, జూలై 4 : విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతిచెందిన సంఘటన గురువారం గుమ్మడిదల మండలం నాగిరెడ్డి గూడెంలో చోటుచేసుకున్నది. వివరాలు వెళ్తే.. గ్రామానికి చెందిన రైతు భిక్షపతి ఉదయం తన రెండు గేదెలను మేత కోసం పోలం వద్దకు తీసుకెళ్లాడు. సమీపంలోని ఓ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చుట్టూ కంచ లేకపోవడంతో మేత మేసుకుంటూ అక్కడికి వెళ్లడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు జీవనాధారంగా ఉంటున్న రెండు గేదెలు ఒకసారి మృతి చెందడంతో కన్నీటి పర్వతమయ్యారు. రూ 1.50 లక్షల వరకు నష్టపోయాయని, ప్రభుత్వం ఆదుకోవాలని భిక్షపతి మొరపెట్టుకున్నాడు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి నివేదికను రూపొందించారు. ఈ మేరకు వెటర్నరీ సిబ్బంది పంచనామా చేసినట్టు తెలిపారు.

ఇరుకు గదుల్లో ఎన్నాళ్లు ఇలా..

- నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం లేక తిప్పలు
- అసౌకర్యాల మధ్య నీటి పారుదల శాఖ అతిథి గృహంలో కొనసాగింపు
- పాత ఎమ్మార్వో ఆఫీస్ స్థలం సమీకృత మార్కెట్‌కు కేటాయింపు



నీటిపారుదల శాఖ అతిథిగృహంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

నర్సాపూర్, జూలై 4: నర్సాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం లేక ఇరుకు గదుల మధ్య ఇబ్బందులు పడుతున్నారు. పాత తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో 13 ఏళ్ల క్రితం ఆ భవనాన్ని కూల్చివేశారు. కొత్త భవనం నిర్మాణానికి నిధులు కేటాయించి నిర్మాణం మొదలు పెట్టారు. అయితే నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో పనులు పిల్లర్ల స్థాయిలోనే నిలిచిపోయాయి. ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్రం ఏర్పడటంతో దానికి కేటాయించిన నిధులు రద్దయ్యాయి. కొన్నాళ్లు స్థానికంగా ఓ అద్దె భవనంలో కొనసాగింది. ఆరేళ్లుగా నీటి పారుదల శాఖ అతిథి గృహంలోకి మార్చారు. ఇరుకు గదుల్లో, అరకొర సౌకర్యాల మధ్య కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. అయితే, పాత తహసీల్దార్ కార్యాలయం స్థలాన్ని సమీకృత మార్కెట్ కోసం కేటాయించడం విడ్డూరం. దీంతో తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం లేకుండా పోయింది. ప్రస్తుతం అక్కడ సమీకృత మార్కెట్ నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. అందరికీ స్థలాలు చూపే మండల రెవెన్యూ కార్యాలయానికి మాత్రం సొంత స్థలం లేకుండా పోయింది.



ఒకే గదిలో డిటీతో పాటు సూపరింటెండెంట్, ఇద్దరు ఆర్ఐలు

మూడు గదుల్లోనే..

ఆరేళ్లుగా నీటిపారుదల శాఖ అతిథి గృహంలో చాలీచాలని వసతుల మధ్య తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతుంది. ఈ భవనంలో కేవలం మూడు గదులు మాత్రమే ఉండటంతో ఒకటి తహసీల్దార్‌కు కేటాయించగా, మరొక గదిలో డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు ఆర్ఐలు, ఒక సూపరింటెండెంట్ కూర్చుంటున్నారు. మరో గదిని ఇతర సిబ్బంది కేటాయించారు. దీంతో ఈ మూడు గదులు కూడా ప్రస్తుతం ఉద్యోగులు కూర్చోవడానికి సరిపోవడం లేదు. ఇక కార్యాలయానికి వచ్చే వారు కనీసం నిలుచుందామన్న చోటు ఉండని పరిస్థితి. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు కూడా నిర్వహించాల్సి రావడంతో రోజు కార్యాలయం జనాలతో సందడిగా ఉంటుంది. కొత్త భవనం నిర్మాణం అటుంచితే కనీసం విశాలమైన భవనంలోకి అయినా మార్చేందుకు రెవెన్యూ ఉన్నతాధికారులు చొరవ చూపడం లేదు.

నానో మెటీరియల్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం

● సదరన్ డెన్మార్క్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ వైకె.మిశ్రా


ప్రొఫెసర్ వైకె.మిశ్రాను సత్కరిస్తున్న గీతం అధ్యాపక బృందం

పటాన్‌చెరు రూరల్, జూలై 4 : నానో మెటీరియల్‌కు ప్రాధాన్యత పెరుగుతోందని, వాటిపై విశేష రీతిలో పరిశోధనలు జరుగుతున్నట్టు దక్షిణ డెన్మార్క్ విశ్వవిద్యాలయంలోని స్మార్ట్ మెటీరియల్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ యోగేంద్ర కుమార్ మిశ్రా చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ అధునాతన సాంకేతికతల కోసం టెట్రా పోడ్స్ ఆధారిత స్మార్ట్ మెటీరియల్స్ అనే అంశంపై గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. స్మార్ట్ 3డీ నానో మెటీరియల్స్ అభివృద్ధిలో సంక్లిష్ట ఆకారపు నానోస్ట్రక్చర్ల ప్రాముఖ్యత గురించి ఆయన వివరించారు. జింక్ ఆక్సైడ్ టెట్రాపోడ్‌లను సంశ్లేషణ చేయడం కోసం జ్వాల ఆధారిత ఒక అడుగు (సింగిల్ స్టెప్) విధానాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించడంతో పాటు వివిధ సాంకేతిక అనువర్తనాలలో వాటి బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించారు. ఈ టెట్రా పాడ్‌లు అనువైన సిరామిక్స్ రూపంలో సూక్ష్మ రంధ్రం గల పరస్పరం అనుసంధానించిన త్రీడీ నానో నెట్‌వర్క్‌లను రూపొందించడానికి అనుకరణాలుగా ఉపకరించడంతో పాటు ఆవిష్కరణలకు కొత్త అవకాశాలను తెరుస్తాయన్నారు. అంతేకాకుండా కార్బన్లు, నైట్రైడ్‌లు, ఆక్సైడ్‌లు, పాలిమర్లు, హైడ్రోజెల్స్ వంటి విస్తృత శ్రేణి పదార్థాలను ఉపయోగించి బోలు టెట్రాపోడల్ 3డీ నెట్‌వర్క్‌ల తయారీకి టెంప్లేట్లుగా ఎలా ఉపయోగపడతామో ప్రొఫెసర్ మిశ్రా ప్రదర్శించారు. ఈ ప్రత్యేకమైన వ్యూహం 3డీ నానో మెటీరియల్ ఇంజనీరింగ్, అధునాతన సాంకేతిక అనువర్తనాల కోసం అద్భుతమైన అవకాశాలను అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకుల సందేహాలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. తొలుత, భౌతికశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సయన్ చౌదరి అతిథిని పరిచయం చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. భౌతిక, రసాయన శాస్త్రాల విభాగాధిపతులు ప్రొఫెసర్ టి.విశ్వం, డాక్టర్ గౌసియా బేగంలు స్మార్ట్ మెటీరియల్స్ రంగంలో చేసిన విలువైన కృషిని గుర్తిస్తూ ప్రొఫెసర్ మిశ్రాను సత్కరించారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

● సిద్దిపేట జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్


పేషెంట్‌తో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

మద్దూరు, జూలై 4: సమయపాలన పాటించకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో శ్రీనివాస్ పీహెచ్‌సీ సిబ్బందిని హెచ్చరించారు. మద్దూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని అన్ని గదులను పరిశీలించారు. అనంతరం రోగులను పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది డ్రెస్‌కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఆటంకంపై అసహనం వ్యక్తం చేశారు. యునానీ ఆస్పత్రి సిబ్బంది పనితీరును మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారితో పాటు సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు ఉన్నారు.

ఎండోమెంట్ భూములకు పరిహారం ఇప్పించండి

● అంగడికిష్టాపూర్ గ్రామస్థుల విజ్ఞప్తి
● దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ విచారణ

మర్కుక్, జూలై 4: ప్రాజెక్ట్ నిర్మాణంలో కోల్పోయిన దేవాదాయ శాఖ భూములకు పరిహారం ఇప్పించాలని అంగడికిష్టాపూర్ గ్రామస్థులు డిమాండ్ చేశారు. మర్కుక్ మండలం అంగడికిష్టాపూర్ గ్రామంలోని ఉమామహేశ్వర ఆలయానికి 25 ఎకరాల భూమి ఉన్నది. కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ కాలువల నిర్మాణానికి ఆలయానికి సంబంధించిన 3.27 ఎకరాల భూమిని సేకరించారు. పరిహారం ఇప్పటివరకు అందకపోవడంతో గ్రామస్థులు కలెక్టరేట్ దేవాదాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం మారగా మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తెలియజేశారు. దీంతో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు గ్రామానికి చేరుకొని విచారణ జరిపారు. ఉమామహేశ్వర ఆలయ భూమి హద్దులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీరాములుగౌడ్, తాజా మాజీ ఎంపీటీసీ గోలి నరేందర్, ఆలయ కమిటీ చైర్మన్ బల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కాలువ నిర్మాణంలో ఆలయ భూములు పోయినందున పట్టా భూములకు ఇచ్చిన విధంగానే పరిహారం చెల్లించాలని కోరారు. ఇన్‌స్పెక్టర్ రంగారావు మాట్లాడుతూ ఉన్నతాధికారులకు నివేదిస్తానని హామీ ఇచ్చారు. వారి వెంట ఆలయ ప్రధాన పూజారి వెంకట నర్సయ్యశర్మ, తంబలి వీరేశం, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా స్విమ్మింగ్ పోటీలు


స్విమ్మింగ్ పోటీలకు హాజరైన బాలబాలికలు

సంగారెడ్డి అర్బన్, జూలై 4 : సంగారెడ్డిలోని స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్ పూల్‌లో రాష్ట్ర స్థాయి స్విమింగ్ పోటీలను గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ నెల 13, 14 వ తేదీల్లో సికింద్రాబాద్ జీహెచ్ఎంసీలో జరిగే 9వ రాష్ట్ర జూనియర్, సబ్ జూనియర్ ఈత పోటీల్లో పాల్గొనే బాలబాలికల ఎంపికను చేపట్టారు. కోచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీహెచ్ఈఎల్ పీఈటీ శశి కుమార్ పర్యవేక్షణలో జరిగిన పోటీలను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి జావిద్‌అలీ ప్రారంభించారు. ఇందులో భాగంగా అండర్-14 ఫ్రీ స్టైల్‌లో మొదటి స్థానంలో మహ్మద్ అబ్దుల్ రహమాన్, రెండో స్థానంలో మోక్షిత్ నిలిచారు. అండర్-11 మొదటి స్థానంలో ఉజేర్, రెండో స్థానంలో విన్సెంట్, బాలికల ఫ్రీస్టైల్‌లో అలియా ఫాతిమా ప్రతిభ కనబరిచింది. విజేతగా నిలిచిన క్రీడాకారులను జావిద్‌అలీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పవన్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గౌతాపూర్ విద్యార్థి ఎంపిక


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

చిలప్‌చెడ్, జూలై 4: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గౌతాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థి అజయ్ ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన పోటీల్లో పాల్గొన్న అజయ్ లాంగ్‌జంప్‌లో ప్రతిభ కనబరిచి బంగారు పథకాన్ని సాధించినట్లు తెలిపారు. 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం పొందాడన్నారు. 7వ తేదీన హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు అజయ్ ఎంపిక అయినట్లు ఆయన తెలిపారు. పాఠశాలకు చెందిన జగదీష్ లాంగ్ జంప్‌లో తృతీయ స్థానం, హరీష్, సాయికిరణ్ 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయస్థానం, హారిక 600 మీటర్ల పరుగు పందెంలో తృతీయస్థానాలు పొంది బహుమతులను గెలుపొందినట్లు తెలిపారు.

మల్లన్నసాగర్ పర్యాటక కేంద్రం.. అడియాసేనా?


మల్లన్నసాగర్ రిజర్వాయర్

▌రిజర్వాయర్‌ను టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దుతామని గత ప్రభుత్వం హామీ
▌రూ.1500 కోట్లతో పనులు చేస్తామని ప్రకటన
▌నెరవేరని హామీ
▌ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకునేనా?

తొగుట, జూలై 4 : మల్లన్నసాగర్ పర్యాటక కేంద్రం ఆశలపై నీలినీడలు కమ్ముకున్నాయి. హైదరాబాద్‌కు 70 కిలోమీటర్ల దూరంలో సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్ గ్రామ శివారులో 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన రిజర్వాయర్ మల్లన్నసాగర్. దీనిని టూరిజం స్పాట్‌గా మార్చుతామని గత ప్రభుత్వం ఆర్భాటంగా చెప్పింది. నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పినప్పటికీ ఒక్క పనికూడ ప్రారంభించ లేదు. ప్రస్తుత ప్రభుత్వం దీని ఊసే ఎత్తడం లేదు.

నెరవేరని కేసీఆర్ హామీలు

కొమురవెల్లి మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను 2022 ఫిబ్రవరి 23న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అక్కడ జరిగిన బహిరంగ సభలో ఈ ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా మార్చుతామని కేసీఆర్ ప్రకటించారు. అన్నదే తడవుగా ఏడాదిన్నరలో పనులు పూర్తి చేస్తామని హామీల వర్షం గుప్పించారు. కొండపోచమ్మ, అన్నపూర్ణ, బస్వాపూర్, వనదుర్గామాత, మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లను టూరిజం స్పాట్‌గా మార్చేందుకు రూ.1500 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. 'మల్లన్నసాగర్ రిజర్వాయర్ చుట్టూ నీళ్లు ఉండి మధ్యలో 600 ఎకరాల భూమి ఉందని దానిని ఐలాండ్‌గా మారుస్తామని ప్రకటించారు. ప్రపంచ సినిమావాళ్లు ఇక్కడికి వచ్చి షూటింగ్ జరుపుకునేలా పనులు చేయాలని ఇరిగేషన్ అధికారులను అప్పట్లో ఆదేశించారు. ఆదే కాకుండా రిజర్వాయర్ చుట్టూ 7,500 ఎకరాల అటవీ భూమి ఉందని అందులో ఔషధ మొక్కలు నాటుతామని ప్రకటించారు. హైదరాబాద్‌కు మల్లన్నసాగర్ అతిదగ్గరలో ఉందని, రీజినల్ రింగ్ రోడ్డు సమీపంలోకి రావడం జరుగుతుందని, రాజీవ్ రహదారి నుంచి ఫోర్‌లేన్ దారి, రూ.100 కోట్లతో అద్భుతమైన ఇరిగేషన్ కాంప్లెక్స్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ స్థాయి కలర్ ఫౌంటేన్స్ దుబాయిలోఉండే బురుజు ఖలీఫాను మించి ఇక్కడ ఆవిష్కృతమవ్వాలని, మనం సింగపూర్ పోవడం కాదు... సింగపూర్ నుంచి టూరిస్టులు ఇక్కడకు రావాలి అని కేసీఆర్ అన్నారు. ఏడాదిన్నర లోపల టూరిజం పనులు పూర్తి చేసి తానే వాటిని ప్రారంభిస్తామని ప్రకటించారు. 28 నెలలు కావస్తున్న ఒక్కపని కూడ నేటికి ప్రారంభం కాకపోవడం గమనార్హం. గత అసెంబ్లీ ఎన్నికల వరకు బీఆర్ఎస్ ప్రభుత్వమే రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు ఇటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా మారింది. అప్పటి సీఎం హామీలలో కేవలం నాలుగు లేన్ల రహదారి పనులు మాత్రం కొనసాగుతున్నాయి.



దృష్టి సారించేనా?

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ సాగునీటి ప్రాజెక్టులపైనే ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో సిద్దిపేట జిల్లాలో 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను టూరిజం స్పాట్‌గా మార్చితే ఈప్రాంతంలోని ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశముంది. ఇటీవల జిల్లాలో హుస్నాబాద్ మండలంలో మహాసముద్రం గండిని పర్యాటక ప్రాంతంగా మార్చుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. గత ప్రభుత్వ హామీ మేరకు మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను కూడా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు మంత్రి చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు ఆకాంక్షిస్తున్నారు.

మండల పరిషత్‌ల అభివృద్ధికి కృషి

● నిమ్జ్‌తో ఏర్పాటుతో పారిశ్రామిక ప్రగతి
● జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్


మాట్లాడుతున్న ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్

ఝరాసంగం, జూలై 4 : మండల పరిషత్‌ల అభివృద్ధికి తన వంతు బాధ్యతగా కృషి చేస్తానని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీలు, వీడ్కోలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దివంగత నేత, మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ హయాంలో 73, 74 రాజ్యాంగ సవరణ తీసుకువచ్చి జిల్లా పరిషత్, మండల పరిషత్‌లకు పెద్దమొత్తంలో నిధులను కేటాయించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ నిధులను కుదించడంతో గ్రామాల్లో అభివృద్ధి కుటుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో అంతర్గత రోడ్ల, లింక్‌రోడ్ల అభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు. పదవుల్లో ఉన్న సమయాల్లో చేసిన సేవలే తమకు గుర్తింపును తెచ్చిపెడుతాయన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఝరాసంగం, న్యాల్‌కల్ ప్రాంతానికి నిమ్జ్ తీసుకొచ్చామని, మున్ముందు ఈ ప్రాంతమంతా పారిశ్రామికంగా మారి మరింత అభివృద్ధి చెందనుందన్నారు. మరిన్ని పరిశ్రమలు వస్తాయని, ఉద్యోగ, ఉపాధిఅవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, ఎంపీపీ దేవదాస్, జడ్పీటీసీ వినీలా నరేష్, మాజీ సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ఎంపీడీవో మండల పరిషత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మరింత అభివృద్ధి

కాంగ్రెస్ పార్టీతోనే మరింత అభివృద్ధి జరుగుతుందని ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ పేర్కొన్నారు. గురువారం ఝరాసంగంలో ఆయనకు ఏర్పాటు చేసిన సన్మానసభ కార్యక్రమంలో మాట్లాడారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ చేస్తున్నదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్లనున్నదని చెప్పారు. గతంలో మండలాభివృద్ధికి కృషి చేశానని, ఇకముందు మరింత అభివృద్ధి చేసుకుందామని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంతరావుపాటిల్, వినీలా నరేష్, దేవిదాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ సమాజ్ అభివృద్ధికి సహకరిస్తా

● మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి అర్బన్, జూలై 4 : క్షత్రియ సమాజ్ అభివృద్ధికి తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. సోమవంశ సహస్రార్జున క్షత్రియ(పట్కర్)సమాజ్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఎస్ఎస్‌కే భవన్‌లో రఘునందన్‌రావుకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వాసంతో తనను ఎంపీగా గెలిపించినందుకు రుణపడి ఉంటానన్నారు. ప్రధానమంత్రి మోదీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కోనేరు చందర్, ఉపాధ్యక్షులు చవాన్ సత్యనారాయణ, చవాన్ పురుషోత్తం, సంయుక్త కార్యదర్శి జ్ఞానేశ్వర్, సంతోష్‌కుమార్, కోశాధికారి మల్లేశం, యువ సమాజ్ కార్యవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

డీఎస్సీ మూడు నెలలు వాయిదా వేయాలి

● మంత్రి, ఎంపీకి అభ్యర్థుల వినతి

సంగారెడ్డి అర్బన్, జూలై 4 : డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలని డీఎస్సీ అభ్యర్థులు గురువారం సంగారెడ్డి మంత్రి దామోదరరాజనర్సింహ, మెదక్ ఎంపీ రఘునందన్‌రావులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమయ్యేందుకు తగిన సమయం లేనందున వాయిదా వేయాలని కోరారు. అంతే కాకుండా గ్రూప్-2,3 పోస్టులు పెంచుతూ గ్రూప్-2 పరీక్షను కూడా వాయిదా వేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో అభ్యర్థులు ఆంజనేయులు, అమర్, నరేశ్, నవీన్, మహేశ్, రేణుక, మౌనిక, స్వాతి, సురేఖ, అఖిలేష్, రమేశ్, వినోద్ తదితరులు ఉన్నారు.

భవానీ మందిర్‌లో ఘనంగా లక్షపుష్పార్చన

● వైభవంగా ఆలయ వార్షికోత్సవం


అమ్మవారికి సమర్పించేందుకు పూలు తీసుకువస్తున్న మాధవానంద సరస్వతి స్వామి

సంగారెడ్డి అర్బన్/సంగారెడ్డి రూరల్, జూలై 4: సంగారెడ్డిలోని భవానీ భువనేశ్వరి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో లక్షపుష్పార్చనను గురువారం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో మహాపూజ, చండీహోమం జరిపించారు. అమ్మవారి పల్లకీసేవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.


లక్షపుష్పార్చన అనంతరం భవానీభువనేశ్వరిమాత

బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయంలో వేలం ఆదాయం రూ.6,00,500

గుమ్మడిదల, జూలై 4 : బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్రస్వామి ఆలయంలో వస్తువుల అమ్మకాలు, పార్కింగ్ కోసం గురువారం ఆలయ ఆవరణలో వేలం పాట నిర్వహించారు. ఆలయానికి వేలం పాటలో రూ.6,00,500 ఆదాయం వచ్చినట్లు ఈవో శశిధరగుప్తా తెలిపారు. వేలం పాటల్లో పార్కింగ్ రూ.3,20,000 సంజయ్‌కు, అమ్మవారి చీరల వేలం రూ.2,60,000 ఆర్.పోచయ్యకు అమ్మవారి ఒడిబియ్యం రూ.25,000 ఎస్.సంజయ్‌కు దక్కింది. వచ్చిన ఆదాయాన్ని దేవాలయ అభివృద్ధి కోసం ఖర్చు చేయనున్నట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా సహాయ కమిషనర్ శివరాజ్, కార్యనిర్వహణాధికారి శశిధర్‌గుప్తా, మాజీ ఎంపీటీసీ నాగేందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, వేణు, మాజీ ధర్మకర్త లక్ష్మీనారాయణ, నాయకులు ప్రతాపరెడ్డి, వినోద్, రమేష్, ఆలయ పర్యవేక్షకులు సోమయ్య పాల్గొన్నారు.

నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన

జిన్నారం, జూలై 4: విద్యార్థులు నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ రమేష్ అన్నారు. గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ, మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిన్నారం ఎస్టీ గురుకుల పాఠశాలలో మిషన్ శక్తి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన చట్టాలు, శిక్షణ గురించి రమేష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్టోన్ క్రషర్ల అనుమతులు పునరుద్ధరించొద్దు'

జిన్నారం, జూలై 4: మాధారం సర్వే నెంబరు 210లోని స్టోన్ క్రషర్, క్వారీల అనుమతులు పునరుద్ధరించవద్దని మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, గ్రామ నాయకులు కలిసి రామచంద్రాపురం పీసీబీ జోనల్, ఏఈ కార్యాలయాలలో ఫిర్యాదులు అందజేశారు. స్టోన్ క్రషర్ పేలుళ్లతో పర్యావరణం, నీటి వనరులు, వ్యవసాయ రంగాలకు ప్రమాదం కల్గుతుందన్నారు. దుమ్ము, ధూళితో కాలుష్య సమస్య నెలకొందని, గడువు ముగిసిన వాటి లైసెన్స్‌ను పునరుద్ధరణ చేయొద్దని కోరారు.

భూములిచ్చిన రైతులకు పొజిషన్లు చూపాలి

జిన్నారం, జూలై 4: జిన్నారం, జంగంపేటలో హెచ్ఎండీఏ లేఅవుట్ భూములు ఇచ్చిన రైతులకు పరిహారం కింద అందజేసిన స్థలానికి పొజిషన్లు చూపాలని జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ కోరారు. ఈ విషయమై గురువారం మంత్రి దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఆయన వినతిపత్రం అందజేశారు. భూములు ఇచ్చిన రైతులకు 600 గజాల చొప్పున పట్టాలు అందజేయగా.. నేటికీ పొజిషన్లు చూపలేదని తెలిపారు. ఆదేవిధంగా శివానగర్ 114 సర్వే నెంబరులో టీఎస్ఐఐసీకి ఇచ్చిన భూముల్లో గ్రామ అవసరాల కోసం పది ఎకరాలను కేటాయించగా.. ఆయా భూముల్లో పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేసి అందజేయాలని కోరారు.

నెలాఖరు వరకే గెస్ట్ లెక్చరర్లు.. ఆ తర్వాత?

● పాతవారిని రెన్యువల్ చేస్తూ.. ఇంటర్ బోర్డు ఉత్తర్వులు
● 31 తర్వాత మళ్లీ పొడగిస్తారా?




మెదక్ అర్బన్, జూలై 4 : విద్యాసంవత్సరం మొదలైనా.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వివిధ సబ్జెక్టుల అధ్యాపకుల కొరత ఉండడంతో బోధన సాగడం లేదు. దాంతో విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొన్నది. ఈ నేపథ్యంలో గెస్ట్ లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలని ఇంటర్ విద్యడైరెక్టర్ శృతి ఓజా ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈనెల 31 వరకే ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఆ తర్వాత విద్యాసంవత్సరమంతా కొనసాగించే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నా ఆమేరకు ఎందుకు ఉత్తర్వులు వెలువడ లేదనే ప్రశ్న తలెత్తుతుంది.

మెదక్ జిల్లాలో 68 మంది గెస్ట్ లెక్చరర్లు

ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో అధ్యాపకులు పోస్టులు ఖాళీగా ఉన్న చోట తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ లెక్చరర్లను 2013 నుంచి ప్రభుత్వం నియమిస్తూ వస్తోంది. వీరికి రోజూ నాలుగు చొప్పున నెలకు 72 తరగతులు ఉండేలా చూస్తూ.. ఒక్కో తరగతికి రూ.390 చొప్పున చెల్లిస్తుంది. ఈ లెక్కన ఒక్కో అధ్యాపకుడు సగటున నెలకు రూ. 28 వేల వేతనం మాత్రమే పొందుతాడు. మెదక్ జిల్లా వ్యాప్తంగా 16 జూనియర్ కళాశాలల్లో 68 మంది గెస్ట్ లెక్చర్లు, 10 మంది (ఒకేషనల్) కాంట్రాక్ట్ లెక్చరర్లు పాఠాలు బోధిస్తున్నారు. వీరిలో పార్ట్‌టైం, కాంట్రాక్టర్ లెక్చరర్లు ఏటా రెన్యూవల్ అవుతూ.. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే కళాశాలలకు హాజరవుతున్నారు. అయితే గెస్ట్ లెక్చరర్ల విషయంలో సర్కార్ ప్రతీ ఏడాది ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. అధ్యాపకుల కొరత ఉండడంతో పాత వారిని రెన్యూవల్ చేస్తూ.. గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఉత్తర్వుల్లో జూలై 31 వరకే విధులు నిర్వర్తించాలని ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమైన అధికారులను సంప్రదించగా త్వరలోనే విద్యాసంవత్సరం అంతా కొనసాగించేలా ఉత్తర్వులు అందే అవకాశముందని పేర్కొన్నారు. ఏటా విద్యాసంవత్సరం మొదలైన రెండు, మూడు నెలల తర్వాత వారిని రెన్యూవల్ చేసేవారు. ఈ ఏడాది మాత్రం ప్రారంభంలో కొనసాగింపుపై నిర్ణయం తీసుకోవడంతో జూనియర్ కళాశాలల్లో బోధన మరింత సాఫీగా జరగనుంది.


ఆటో రెన్యూవల్‌తో కొనసాగించాలి



2012-13 విద్యాసంవత్సరం నుంచి గెస్ట్ లెక్చరర్లను నియమిస్తూ వస్తోంది. 12 ఏళ్ల నుంచి పని చేస్తున్న మమ్మల్ని ఆటో రెన్యూవల్‌తో కొనసాగించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.48 వేల చొప్పన వేతనం ఇవ్వాలి. పీరియడ్ విధానాన్ని రద్దుచేసి 12 నెలలకు కన్సాలిడేటెట్ పే ఇవ్వాలి.

- బండి కృష్ణ, తెలంగాణ గవర్నమెంట్ జూనియర్ కళాశాల గెస్ట్ లెక్చరర్స్ 2152 అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

జూలై 31 వరకు కొనసాగింపు



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గతేడాది పనిచేసిన గెస్ట్ లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలని ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు ఆదేశించారు. 68 మంది గెస్ట్ లెక్చరర్లు విధుల్లో చేరారు. ఈనెల 31 వరకు కొనసాగింపుపై ఉత్తర్వులు జారీ అయ్యాయి.

- సత్యనారాయణ, జిల్లా ఇంటర్ విద్యాధికారి

విద్యాసంస్థల బంద్ విజయవంతం

● పలు మండలాల్లో పాఠశాలల మూసివేత

జహీరాబాద్/సదాశివపేట/నారాయణఖేడ్/మెదక్ అర్బన్/పెద్దశంకరంపేట/నర్సాపూర్/మనోహరాబాద్/పాపన్నపేట, జూలై 4: భారత్‌బంద్‌లో భాగంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్ సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో విజయవంతమైంది. జహీరాబాద్‌లో చేపట్టిన బంద్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొని మాట్లాడారు. నీట్ పరీక్ష లీక్‌పై కేంద్ర విద్యాశాఖ మంత్రి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు రాజేష్, పృథ్వీరాజ్, గణేష్, సురేష్ పాల్గొన్నారు. సదాశివపేట పట్టణంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను మూసివేయించారు. అనంతరం డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నారాయణఖేడ్‌లో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్, ఎన్ఎస్‌యూఐ, డీవైఎఫ్ఐల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఆయా సంఘాల జిల్లా, డివిజన్ బాధ్యులు నల్లవల్లి రమేష్, సతీష్, అశోక్, తెంకటికుమార్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రకాంత్, ఇసాక్, డేవిడ్ పాఠశాలలను మూసేయించారు. నీట్ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్‌ను వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మెదక్‌లో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. పెద్దశంకరంపేటలో ఎన్ఎస్‌యూఐ నాయకులు వెంకటేశ్వర్‌గౌడ్, శివ, మహిపాల్, మహేష్‌గౌడ్, అరుణ్, పవన్, శ్యామ్ పాఠశాలలను బంద్ చేయించారు. నర్సాపూర్‌లో ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు హరీశ్‌వర్ధన్, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభులింగం పేర్కొన్నారు. మనోహరాబాద్‌లో ఎన్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు గానుగ రామకృష్ణ ఆధ్వర్యంలో పాఠశాలలు మూసేయించారు. పాపన్నపేటలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ మండల నాయకులు నరేందర్, కృష్ణ వెల్లడించారు.


కళ్లకల్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు


డిప్యూటీ తహసీల్దార్ వీరేశంకు వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్

పచ్చిరొట్టతో అధిక దిగుబడులు

● మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్

నిజాంపేట, జూలై 4: పచ్చిరొట్ట పంట వేయడం వలన భూమిలో పోషకాలు పెరిగి పంట దిగుబడి పెరుగుతుందని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ అన్నారు. మండల పరిధిలోని నందిగామ గ్రామంలో పచ్చిరొట్ట పంటలను గురువారం పరిశీలించి, పంట యాజమాన్య పద్ధతులపై వివరించారు. పచ్చిరొట్ట పంటను భూమిలో కలియదున్నడం వల్ల భూమిలో పోషకాలు పెరిగి పంటల్లో దిగుబడి వస్తుందన్నారు. వర్షాకాలంలో వేస్తున్న వివిధ పంటల యజమాని పద్ధతులపై ఎరువుల గురించి చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజ్ నారాయణ, ఏఈఓలు శ్రీలత, కావేరి గ్రామ రైతులు పాల్గొన్నారు.

పత్తి సాగులో జాగ్రత్తలు పాటిస్తే లాభాలు: ఏవో

గుమ్మడిదల, జూలై 4: పత్తి పంట సాగులో రైతులు సరైన జాగ్రత్తలు, సరైన సమయంలో మందులు పిచికారీ చేస్తే అధిక లాభాలు సాధించొచ్చని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు సూచించారు. గురువారం గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామంలో సాగు చేస్తున్న పత్తి పంటను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ప్రస్తుతం మండలంలో సుమారు 1,300 వందల ఎకరాల్లో పత్తి పంట సాగవుతుందన్నారు. పంట చివరి వరకు రైతులు సరైన పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

నేడు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

● అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జావిద్ అలీ

సంగారెడ్డి అర్బన్, జూలై 4: జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు 5న సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జావిద్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. 8,10,12 ఏళ్ల బాల బాలికలకు ఈ ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు 7న గచ్చిబౌలిలో జరిగే రాష్ట్రస్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. వివరాలకు 9849355586, 9492728034 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలి

● జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ పీడీ లలితకుమారి

నారాయణఖేడ్, జూలై 4: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అర్థమయ్యే రీతిలో ఆట,పాటల ద్వారా బోధించాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ పీడీ లలితకుమారి సూచించారు. ఖేడ్, సిర్గాపూర్ మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు ప్రీస్కూల్ కరికులం శిక్షణలో భాగంగా మూడోరోజు గురువారం నిర్వహించిన శిక్షణకు ఆమె హాజరై మాట్లాడారు. పిల్లలను ఆకట్టుకునేలా బోధించే మెళకువలను వివరిస్తూ పలు సూచనలిచ్చారు. అనంతరం ఖేడ్ మండలం లింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయ కర్త సౌమ్య, సీడీపీవో సుజాత, అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.


అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తున్న లలితకుమారి

ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి: ఆర్డీవో

హవేళిఘణపూర్, జూలై 4: ధరణిలో ఉన్న పెండింగ్ భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించి మాట్లాడారు. కార్యాలయాల్లో కల్యాణలక్ష్మి, ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలన్నారు. మీసేవ నుంచి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సర్టిఫికెట్లను జారీ చేయాలన్నారు. అనంతరం తొగిట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆమె వెంట తహసీల్దార్ నారాయణ, నయాబ్ తహసీల్దార్ ప్రభాకర్ ఉన్నారు.


తహసీల్దార్ కార్యాలయంలో ఫైల్స్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి

సాగు చేసే రైతులకే 'రైతుభరోసా'

తూప్రాన్/వెల్దుర్తి/కొల్చారం, జూలై 4: వ్యవసాయ పంటల సాగు చేస్తున్న రైతులకే రైతు భరోసా పథకం అందజేయాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం తూప్రాన్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల మహాసభ నిర్వహించారు. సొసైటీ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 10 ఎకరాల వరకు పంటల సాగుచేస్తున్న రైతులకు భరోసా పథకం అందజేయాలని తీర్మానం చేశారు. సొసైటీ వైస్ చైర్మన్ దీపక్‌రెడ్డి, డైరక్టర్లు గొల్లపల్లి సంతోష్‌రెడ్డి, పట్లూరి చంద్రశేఖరరెడ్డి, ధరావత్ గోపి పాల్గొన్నారు. వెల్దుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి అధ్యక్షతన రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవింద్, ఏడీఏ పుణ్యవతి, మండల వ్యవసాయ అధికారులు, రైతులు హాజరయ్యారు. ప్రభుత్వం షరతులు లేకుండా ఎకరానికి రూ.15 వేలు 15లోపు రైతుల ఖాతాల్లో వేయాలన్నారు. కొల్చారం మండల పరిధిలోని వరిగుంతం పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి శ్వేతకుమారి, జిల్లా సహకార శాఖ ఆడిట్ అధికారి కరుణాకర్‌చారి రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. సొసైటీ చైర్మన్ చిన్నారపు ప్రభాకర్, సొసైటీ సీఈవో చిన్నారపు రాములు పాల్గొన్నారు.


వెల్దుర్తి: సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్

రాహుల్‌గాంధీ ఆరోపణలు సమంజసం కాదు

● బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్


బీజేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న కోణం విఠల్

పెద్దశంకరంపేట, జూలై 4: పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ హిందువులపైన, హిందూమతంపైన తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదని బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. గురువారం పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలోఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న రాహుల్‌గాంధీ హుందాగా ప్రవర్తించాలని, కానీ 100 కోట్ల హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు సూర్యప్రకాష్, శ్రావణ్‌కుమార్, అశోక్, మంగలి క్రిష్ణ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

హన్మంతాపూర్‌లో వైద్యశిబిరం

నర్సాపూర్: నర్సాపూర్ పట్టణ పరిధిలోని 1వ వార్డులో ఉన్న హన్మంతాపూర్‌లో గురువారం ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానికులను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేసి, వర్షాకాలంలో రోగాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, డాక్టర్ స్వప్న, ఏఎన్ఎంలు నిర్మల, లక్ష్మి పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలి: బీజేపీ

అల్లాదుర్గం: నిరుద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం బీజేవైఎం, బీజేపీ నాయకులు అల్లాదుర్గం తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. బీజేపీ నాయకులు కంచరి బ్రహ్మం, కాళ్ల రాములు, యాదగిరి మాట్లాడారు.

మహోత్సవ పత్రిక ఆవిష్కరణ

సదాశివపేట: సదాశివపేట పట్టణంలో వీరశైవ సమాజం, చౌకిమఠం ఆధ్వర్యంలో జూలై 13 నుంచి 21 వరకు కాశీ జగద్గురువులు డాక్టర్ చంద్రశేఖర శివచార్య మహాస్వామి పర్యవేక్షణలో నిర్వహించే శివపంచాక్షరి మహామంత్ర, కోటి జపయజ్ఞ, ఇష్ట లింగార్చన మహోత్సవ ఆహ్వాన పత్రికను గురువారం సమాజం ప్రధాన కార్యదర్శి పీల్లోడి విశ్వనాథం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

హరితహారంపై అధికారులకు అవగాహన: ఎంపీడీవో

మనోహరాబాద్: మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఎంపీవోలకు, ఏపీవోలకు, ఈసీలకు, గ్రామ కార్యదర్శులకు హరితహారంపై అవగాహన కల్పించారు. త్వరలో చేపట్టబోయే వన మహోత్సవంలో మొక్కలు ఏవిధంగా నాటాలనే అంశంపై అధికారులకు సూచనలు ఇచ్చారు.

కోట్ల నిధులతో మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాం

● గుమ్మడిదల జడ్పీటీసీ కుమార్‌గౌడ్

గుమ్మడిదల/నారాయణఖేడ్/కోహీర్, జూలై 4: గడిచిన ఐదేళ్లలో కోట్ల రూపాయలు ఖర్చుచేసి గుమ్మడిదల మండలాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దినట్లు జడ్పీటీసీ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ పాలకవర్గం వీడ్కోలు సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి దామోదర్ నరసింహ చేతులమీదుగా కుమార్‌గౌడ్ సన్మానం పొందారు. ఈ సందర్భంగా గుమ్మడిదలలో విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్ల పదవీకాలంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎంపీపీ సద్ది ప్రవీణాభాస్కర్‌రెడ్డితో కలిసి సమిష్టి నిర్ణయాలతో గుమ్మడిదల మండలాన్ని అభివృద్ధి చేశామన్నారు. ప్రజాసేవలో ఉన్నంతవరకు ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. ఎంపీపీలు, జిల్లా పరిషత్‌ల పదవీకాలం పూర్తి కావడంతో గురువారం సంగారెడ్డిలో జరిగిన వీడ్కోలు సమావేశంలో నారాయణఖేడ్ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, ఎంపీపీ చాందిబాయి చౌహాన్‌లకు మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎంపీలు సురేష్‌షెట్కార్, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, సునితారెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి సన్మానించారు. సంగారెడ్డి పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి దామోదర్‌తో పాటు, మెదక్, జహీరాబాద్ ఎంపీలు రఘునందన్‌రావు, సురేష్‌కుమార్‌షెట్కార్, ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, సునితారెడ్డి, సంజీవరెడ్డి కోహీర్ జడ్పీటీసీ రాందాస్ ను శాలువా పూలమాలతో సత్కరించారు.


మంత్రి దామోదర్ రాజనరసింహ చేతులమీదుగా సన్మానం పొందుతున్న జడ్పీటీసీ కుమార్‌గౌడ్

భారంగా గ్రామపంచాయతీ నిర్వహణ

● ఎంపీడీవోకు పంచాయతీ కార్యదర్శుల వినతి

చేగుంట, జూలై 4: గ్రామపంచాయతీలో నిధులు లేక గ్రామపంచాయతీల నిర్వహణ కష్టతరం అవుతుందని చేగుంట మండల పంచాయతీ కార్యదర్శులు గురువారం ఎంపీడీవో చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడు ఎల్లం మాట్లాడుతూ ఐదునెలలుగా చేగుంట మండల పరిధిలోని గ్రామపంచాయతీల్లో నిధులు లేక తమ సొంత డబ్బులతో గ్రామపంచాయతీ నిర్వహణ చేపట్టామని, నిధులు కేటాయించకపోవడంతో కార్యదర్శులకు కష్టతరంగా మారిందని చెప్పారు. ప్రభుత్వం స్పందించి గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రోజా, సభ్యులు సువర్ణ, కల్పన, శైలజ, సమీరా, శ్రీకాంత్, నగేష్, రాజు, కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.


చేగుంట ఎంపీడీవో చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

బాసర త్రిపుల్ ఐటీకి పలువురు విద్యార్థుల ఎంపిక

కోహీర్/పెద్దశంకరంపేట/హత్నూర/నాగల్‌గిద్ద/రామాయంపేట, జూలై 4: బాసర త్రిపుల్ ఐటీకి కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. గురువారం ప్రధానోపాధ్యాయుడు జాకీర్‌హుస్సేన్ విద్యార్థులను సన్మానించారు. పెద్దశంకరంపేట మోడల్ స్కూల్ నుంచి పి.సచిత, జి.కీర్తన, హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచనూర్ గ్రామంలో గల తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన మద్దూరి చంద్రిక, ఎం.మౌనిక, నాగల్‌గిద్ద మండలం పరిధిలోని మోర్గి మోడల్ స్కూల్‌కు చెందిన క్రిష్ణ, సంగమేష్, అఖిల, నీలకంట్, శివానంద్, రామాయంపేట పట్టణంలోని స్థానిక వివేకానంద విద్యాలయానికి చెందిన విద్యార్థిని దీక్ష సంస్కార్ బాసరలోని త్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత

శివ్వంపేట, జూలై 4: శివ్వంపేట మండలం రెడ్యాతండా పంచాయతీ పరిధికి చెందిన మెగావత్ దేవేందర్ ఎనిమిది నెలలక్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతడికి బీఆర్ఎస్ సభ్యత్వం ఉండడంతో పార్టీ నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే సునితారెడ్డి కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ డైరెక్టర్ యాదాగౌడ్, తాజా మాజీ సర్పంచ్ రంగీలాఅంజనేయులు, మహేందర్‌రెడ్డి, శేఖర్, సత్యంగౌడ్ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

● మహిళా మోర్చా ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతి


అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

మెదక్ అర్బన్, జూలై 4: మహిళలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఆరోపించారు. రాష్ట్ర మహిళా మోర్చా శాఖ పిలుపు మేరకు అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మహిళలకు ప్రతినెల రూ.2500, కొత్తగా పెళ్లి చేసుకునే వారికి రూ.లక్షతోపాటు ఒక తులం బంగారం, డిగ్రీ చదివే విద్యార్థులకు స్కూటీ వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, ప్రధాన కార్యదర్శి అయితారం సంగీత, రామాయంపేట మండలాల అధ్యక్షురాలు లావణ్య, దివ్య, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ లక్ష్మణ్‌కు శుభాకాంక్షలు

సదాశివపేట, జూలై 4: రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ జన్మదినం సందర్భంగా బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు నెమలికొండ వేణుమాధవ్ గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ కె.లక్ష్మణ్ నివాసంలో ఆయనను కలిసి శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జనార్ధన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు చర్ల గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ డిపోకు బస్సులు కేటాయించాలి

● రాష్ట్ర రవాణాశాఖ మంత్రికి కాంగ్రెస్ నాయకుల వినతి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సాపూర్, జూలై 4: నర్సాపూర్ నియోజకవర్గంలో ప్రయాణికుల రద్దీకి తగ్గట్టు బస్సులు కేటాయించి ఇబ్బందులు తొలగించాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవులరాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, వెల్దుర్తి ఎంపీపీ నరేందర్‌రెడ్డి, నర్సాపూర్ మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశం, మహేశ్వర్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, మల్లేష్, పీఏసీఎస్ చైర్మన్లు రాజుయాదవ్, వెంకట్రామ్‌రెడ్డి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత నియోజకవర్గం హుస్నాబాద్‌కు వెళ్లి వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

'పటాన్‌చెరు నుంచి నర్సాపూర్‌కు బస్సులు పెంచాలి'

నర్సాపూర్, జూలై 4: పటాన్‌చెరు నుంచి నర్సాపూర్‌కు బస్సులు పెంచాలని పలువురు ఉద్యోగులు, ప్రయాణికులు కోరుతున్నారు. నర్సాపూర్ నుంచి పటాన్‌చెరుకు వివిధ పనులతో పాటు ఉద్యోగులు, అక్కడి పరిశ్రమలలో పనులు చేసే కార్మికులతో పాటు విద్యార్థులు రోజూ వెళ్తుంటారన్నారు. వారికి తగ్గట్టు బస్సులు లేకపోవడంతో కిక్కిరిసి వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. నర్సాపూర్ నుంచి పటాన్‌చెరు వెళ్లే మార్గంలో నత్నయపల్లి, కాగజ్‌మద్దూర్ గ్రామాల వద్ద రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఉండడంతో బస్సులు నడపలేకపోతున్నామని అధికారులు అంటున్నారని, రోడ్డును బాగుచేసి బస్సులను పెంచాలని కోరారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ఆందోళన

జిన్నారం, జూలై 4: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు జగన్‌రెడ్డి, జిల్లా, మండల నాయకులు ప్రతాప్‌రెడ్డి, నర్సింగరావు, రమేష్, ఎల్లేష్‌యాదవ్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంటు, డీఎస్సీ నోటిఫికేషన్, రెండు లక్షల ఉద్యోగాల సహా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ భిక్షపతిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఉపాధ్యాయులను నియమించాలని డీఈవోకు వినతి

హత్నూర, జూలై 4: హత్నూర మండల పరిధిలోని నాగులదేవులపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ గ్రామస్థులు గురువారం సంగారెడ్డికి తరలివెళ్లి డీఈవోకు వినతిపత్రం అందజేశారు. ఒకటి నుంచి పాఠశాల నిర్వహణ కొనసాగుతుండగా.. 98 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వీలైనంత త్వరగా నియమిస్తామని జిల్లా విద్యాధికారి హామీఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ బావికాడి సుధాకర్ పాల్గొన్నారు.

గురుకులంలో పచ్చదనం, పరిశుభ్రత

నారాయణఖేడ్, జూలై 4: ఖేడ్ శివారులోని మహాత్మా జ్యోతి బాపూలే బీసీ బాలుర గురుకులంలో గురువారం పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆవరణలో గతంలో నాటిన మొక్కల మధ్య పిచ్చి మొక్కలు, గడ్డి పెరగడంతో విష కీటకాలు సంచరించే అవకాశం ఉండటంతో డోజర్‌తో తొలగించారు. ఈ పనులను గురుకులం ప్రిన్సిపల్ శ్రీను, ఏటీపీ శివశంకర్‌లు పర్యవేక్షించారు.

సాహితీ ఆస్పత్రిలో నేడు రక్తదాన శిబిరం

సంగారెడ్డి అర్బన్, జూలై 4: సంగారెడ్డిలోని సాహితీ ఆస్పత్రిలో నేడు రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ఎండీ రామసాహితీ తెలిపారు. స్థానిక రైతుబజార్ ఎదురుగా ఉన్న సాహితీ ఆస్పత్రిలో ఉదయం 9 నుంచి 2 గంటల వరకు రక్తదాన శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొ.అనిల్‌కుమార్ హాజరై శిబిరాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. రక్తదానం చేయాలనుకునే వారు శిబిరంలో పాల్గొనవచ్చని తెలిపారు.


రాముసాహితీ

కుంటలోకి తరలించిన బండరాళ్లు

శివ్వంపేట, జూలై 4: పెద్దపెద్ద బండరాళ్లు కుంటలోకి తరలించడంతో పూడ్చుకుపోయే ప్రమాదం ఉన్నదని, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. మండల పరిధిలోని దొంతి మాసానికుంటలో కొందరు వ్యక్తులు పెద్దపెద్ద బండరాళ్లను తీసుకొచ్చి వేయడంతో కుంట పూడ్చుకుపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాళ్లు వేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ సునీతను సంప్రదించగా.. కుంటలో వేసిన రాళ్లను పరిశీలించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి


పెద్దశంకరంపేటలో కొమురయ్య వర్ధంతి నిర్వహిస్తున్న నాయకులు

వట్‌పల్లి/పెద్దశంకరంపేట/నారాయణఖేడ్/నాగల్‌గిద్ద జూలై 4: దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని వట్‌పల్లిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అందోల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పెద్దగొల్ల మల్లయ్య, కురుమ యువత మండలాధ్యక్షుడు గోరిల్ల మహేష్, నాయకులు పాల్గొన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతిని పెద్దశంకరంపేటలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రాయిని మధు, గంగారెడ్డి కుమార్, విఠల్‌రెడ్డి, గంగారాం పూలమాలవేసి నివాళులర్పించారు. నారాయణఖేడ్ పట్టణ శివారులోని డబుల్ బెడ్‌రూం గృహాల సమీపంలో కురుమ సంఘంఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో కొమురయ్య 78వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం బాధ్యులు మల్గొండ, అంజన్న, సంతోష్, దత్తు, నర్సింహులు పాల్గొన్నారు. నాగల్‌గిద్ద పరిధిలోని కారాముంగి, ఔదత్‌పూర్, ఉట్‌పల్లి గ్రామాల్లో కొమురయ్య చిత్రపటానికి కురుమ సంఘం నాయకులు శ్రావణ్, భీమన్న నివాళులర్పించారు.


ఖేడ్‌లో కొమురయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

రైతుల శ్రేయస్సే లక్ష్యం: సాయిచరణ్

జహీరాబాద్, జూలై 4: రైతుల శ్రేయస్సే లక్ష్యంగా కృషిచేద్దామని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆగమ సాయిచరణ్ అన్నారు. గురువారం మార్కెట్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషిచేస్తున్నదన్నారు. భవిష్యత్‌లో మార్కెట్ కమిటీని మరింత అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. మార్కెట్ యార్డులో స్థలం సరిపోనందున నూతన మార్కెట్ యార్డు నిర్మాణం, మార్కెట్‌యార్డులో పాతగోదాంలను తొలగించి వాటిస్థానంలో షాపింగ్‌కాంప్లెక్స్‌ల నిర్మాణం, మార్కెట్లో గల ఆర్‌సీసీ షెడ్‌లో దుకాణాల నిర్మాణం, పశువుల మార్కెట్ అభివృద్ధికి చర్యలు, మార్కెట్‌లో పరిశుభ్రత పాటించేలా చర్యలు చేపట్టాలంటూ తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు కండెం సుజాత, శంకర్‌పాటిల్, వంశీరాజ్, జాఫర్, శేఖర్, అఖిల్‌అహ్మద్, మార్కెట్ కార్యదర్శి అనిల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఆగమ సాయిచరణ్

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్త ఉద్యమం

● అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కోశాధికారి మంగ

సంగారెడ్డి రూరల్, జూలై 4: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కోశాధికారి మంగ తెలిపారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగులు నష్టం కలిగించే జీవో 10ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2023లో 24 రోజులు పాటు చేసిన సమ్మె సమయంలో అప్పటి ప్రభుత్వం యూనియన్‌తో చర్చలు జరిపి సమ్మెను విరమింపచేజేసి అంగన్‌వాడీ టీచర్‌కు రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు ఇస్తామని జీవో విడుదల చేసిందని, వెంటనే ఆ జీవోను ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు, యూనియన్ అధ్యక్షురాలు శశికళ, ఇందిరా, సంగీత. బాలమణి, భూమవ్వ, లక్ష్మీ, వీరమణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కోశాధికారి మంగ